ప్రజాశక్తి

సోమవారం 4 సెప్టెంబర్ 2023

5



అల్లూరి సీతారామరాజు

నేటి నుంచి గుడిశ పర్యాటక కేంద్రం మూసివేత

ప్రజాశక్తి -మారేడుమిల్లి: రాబోవు కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకుని గుడిశ పర్యాటక కేంద్రాన్ని సన్నద్ధం చేసే క్రమంలో పారిశుధ్యం, రహదారి నిర్వహణ ఇతర పనులకు వీలుగా ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు రెండు వారాలపాటు మూసేస్తున్నట్లు మారేడుమిల్లి అటవీ క్షేత్రాధికారి ఎన్ఎకె. అజాద్ ప్రకటనలో తెలిపారు. ఈవిషయాన్ని దూరప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులు గమనించి, గుడిశ పర్యటనను వాయిదా వేసుకోవాలని సూచించారు.

కాగా కార్తీక మాసానికి ఇంకా రెండు నెలలు గడువు ఉన్న నేపథ్యంలో ఇప్పటినుంచే గుడిశ సందర్శనకు పర్యాటకులను అనుమతించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమైతున్నాయి. గుడిస సందర్శనకు వచ్చిన పర్యాటకుల నుంచి వసూలు చేసిన సొమ్ములో అవకతవకలు జరిగినట్లు గత నెల 30న జరిగిన గ్రామసభలో టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం, ఘర్షణ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు..

జాబ్ కేలండర్ ప్రకటించాలి

- జిఒ 3 రిజర్వేషన్ చట్టబద్ధం చేయాలి - సిపిఎం సమర భేరిలో నేతలు



స్థానిక గిరిజనులతో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి- యంత్రాంగం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లాలోని పలు మండలాల్లో సిపిఎం సమర భేరి చేపట్టారు. సిపిఎం నేతలు ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలను వివరించారు.

అరకులోయ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రభుత్వశాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా అరకులోయ మండలం చినలబుడు గ్రామ పంచాయతీ కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స మాట్లాడుతూ, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి హామీ ఇచ్చి నిరుద్యోగులకు మోసం చేసిందన్నారు. 9 సంవత్సరాల కాలంలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, కనీసం కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో దేశంలో రెండు కోట్ల ఉద్యోగాలు తొలగించి దేశంలో అచ్చేదిన్ కోసం మోడీ ప్రభుత్వం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారని సచివాలయ ఉద్యోగాలు మినహా ఏ ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించాలని, వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో అనేకమంది యువతీ, యువకులు బీఈడీ, డైట్, ఇంజనీరింగ్, డిగ్రీలు, పీజీలు చదివి ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తక్షణమే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

సిపిఎం నాయకులు పి.బాలదేవ్ మాట్లాడుతూ, ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్ కల్పించే జీవో 3 రద్దు చేసి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవో 3 రిజర్వేషన్ చట్టబద్ధం చేసి ప్రభుత్వ ఉద్యోగాలు నియామకాలు చేపట్టాలని అప్పలసి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకురాలు లక్కోయి కుమారి, గాసి, గోపి, చిన్నలబుడు గ్రామ యువకులు కె.సిద్ధార్థ నాథ్, పి.మోజేష్, రాజ్ కుమార్, సీమోను, అభిషేక్ డానియల్, ప్రశాంత్, అరవింద్ పాల్గొన్నారు.



ప్రచారం చేపడుతున్న నేతలు

హుకుంపేట: నిరుద్యోగుల సమస్యలపై ఈనెల 4న చేపట్టే నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మండలం కేంద్రంలో సిపిఎం సమరబేరిలో భాగంగా లక్ష్మణరావు మాట్లాడుతూ, నిరుద్యోగ యువతి, యువకులు డిఇడీ, బిఇడ్, ఐటిఐ డిప్లొమా చదివి ఖాళీగా ఉంటున్నారనానద్ర.ఎస్టీ బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కృష్ణా రావు, టి.అప్పులకొండ పడాల్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం సమరభేరి ప్రచారం

అరకులోయ:సిపిఎం సమరభేరిలో భాగంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కే.రామారావు ఆధ్వర్యంలో సుంకరమెట్ట వారపు సంతలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. జీవో 3 చట్టబద్ధత కల్పించాలని, గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేసి యువతకు ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 4న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కూలి పనులు దొరకక ఉపాధి లేక అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఒకపక్క నిత్యావసర ధరలు పెరిగి కొనుక్కోలేని పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్ డీజిల్ చార్జీలు పెంచి పేదవాడి నడ్డి విరుస్తుందన్నారు.ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కే.రామన్న కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్న బాబు, నాయకులు పి.నాని బాబు, జి.బుజ్జిబాబు, టీ.జోషి, కే. బుజ్జిబాబు పాల్గొన్నారు.

కదలిరండి..

- నేడు మండల కేంద్రాల్లో ధర్నాలు

- గిరిజనులకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి పాడేరు:- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలు, నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ఈ నెల 4న సోమవారం అల్లూరి జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాలకు కదలి రావాలని సిపిఎం పిలుపు నిచ్చింది.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదివాసి వ్యతిరేక విధానాలపై నిరసిస్తూ ఆగస్టు 29 నుంచి ఏడు రోజులపాటు సిపిఎం జిల్లాలోని అన్ని మండలాల్లో పోరాట కార్యక్రమాలను నిర్వహించిన సంగతి విధితమే. ముఖ్యంగా ఆదివాసి గిరిజన యువత ఉద్యోగ ఉపాధ్యాయ నియమకాలు, పదోన్నతుల్లో నూరు శాతం రిజర్వేషన్ పొందుతున్న జీవో 3 రిజర్వేషన్ పునరుద్ధరణతో పాటు చట్టబద్ధత కోసం సిపిఎం ఈ పోరాటానికి ఉపక్రమించింది. ప్రభుత్వాల తీరుతో ఉద్యోగ అవకాశాలు అందుకోలేకపోతున్న గిరిజన యువతకు చైతన్యం కల్పించింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పోస్టుల ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, నిత్యావసర వస్తువుల అధిక ధరలను తగ్గించాలని సిపిఎం సమరభేరి పేరుతో పోరాటం సాగిస్తోంది. ఆదివాసి యువత సంఘటితంగా పోరాడి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఉద్యోగ రిజర్వేషన్లను పరిరక్షించుకోవాలని నేతలు పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజన యువత జీవన మనుగడకు విఘాతం కలిగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించాలన్నారు. 4న మండల కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సీపీఎం పిలుపు నిచ్చింది.



గ్రామంలో ఉన్న చిన్నారులు, గర్భిణులు

అంగన్‌వాడీ కేంద్రం లేక..

చిన్నారులు, గర్భిణుల అవస్థలు

-పౌష్టికాహారం తీసుకునేందుకు కిలోమీటర్ దూరం నడక

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయితీ బలియగూడ పిటిజి గ్రామంలో అంగన్వాడి కేంద్రం లేక ఆ గ్రామ ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో సుమారు 55 పీటిసి కుటుంబాలు ఉన్నాయి. అందులో ఐదేళ్ల లోపు చిన్నారులు సుమారు 40 మంది ఉన్నారు. వీరితో పాటు బాలింతలు, గర్భిణీ మహిళలు కూడా ఉన్నారు. అక్కడ అంగన్వాడి కేంద్రం లేకపోవడంతో సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న సాగర అంగన్వాడి కేంద్రం నుంచి ప్రతి నెల పౌష్టికాహారాన్ని ఆ గ్రామస్తులు తీసుకుంటున్నారు. గతంలో కొన్నాళ్ల పాటు ఆ గ్రామానికి చెందిన ఓ మహిళ సాగర నుంచి పౌష్టికాహారాన్ని బలియగూడ, తరలించి చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు పంపిణీ చేసేది. అయితే ఆమెకు ఎటువంటి వేతనం చెల్లించక పోవడంతో ఆమె పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడం మానేసింది. దీంతో, ఆ గ్రామస్తులు కిలోమీటర్ దూరం నడుచుకొని వెళ్లి సాగర అంగన్వాడి కేంద్రం నుంచి ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకుంటున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు సుమారు 40 మంది ఉన్నా అంగన్వాడి కేంద్రం మంజూరు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పిటిజి గిరి చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో రక్తహీనత వ్యాధి నివారించడానికి ప్రభుత్వం ప్రతి అంగన్వాడి కేంద్రం ద్వారా గిరి చిన్నారులు, బాలింతలు ,గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందిస్తుంది. అంగన్వాడి కేంద్రం మంజూరు చేయడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో నిరుపేద చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందని పరిస్థితి నెలకొంటుందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు గత ఐదేళ్ల క్రితం ఆ గ్రామంలో ఒకే ఇంట్లో నుంచి ముగ్గురు చిన్నారులు మృతి చెందగా ఆ గ్రామంలో ఉన్నత స్థాయి అధికారులు పర్యటించి వెంటనే అక్కడ అంగన్వాడి కేంద్రం మంజూరు చేయాలని అప్పట్లో అదేశాలు జారీ చేశారు. అయిన ఇప్పటికీ స్థానిక ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడి కేంద్రం మంజూరుకు చర్యలు చేపట్టకపోవడం విచారకరం. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి బలియాగూడ గ్రామంలో నూతన అంగన్వాడి కేంద్రాన్ని మంజూరు చేసి పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

బలియాగుడ పిటిజి గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామంలో సందర్శించి ఆ గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్న ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆరేళ్ల లోపు చిన్నారులు సుమారు 40 మంది ఉన్నారన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఆ గ్రామస్తులు విన్నవించుకున్నా నూతన అంగన్వాడి కేంద్రం మంజూరు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతు న్నారన్నారు. తక్షణమే అంగన్వాడి కేంద్రాన్ని మంజూరు చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.



గ్రామంలో ఉన్న బాలింతరాలు

గ్రూపు-1 విజేత శ్రీవిద్యకు ఘనసత్కారం



శ్రీవిద్య, ఆమె తండ్రిని సత్కరిస్తున్న ఆదివాసీ నేతలు

ప్రజాశక్తి-చింతూరు : గ్రూప్ 1 ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన సోడే శ్రీవిద్యను ఆదివారం కుమ్మూరు ఎంపిటిసి వేఖ రాజకుమార్, సున్నం.వెంకట్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కారం సుబ్బారావు, ఆదివాసీ ఉద్యోగులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. శ్రీవిద్యతోపాటు ఆమె తండ్రి ఉపాధ్యాయుడు సోడే నారాయణను కూడా అభినందిచారు. ఈ సందర్భంగా ఎంపిటిసి వేఖ రాజకుమార్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షల్లో శ్రీవిద్య సాధించిన విజయం ఆదివాసీల్లో స్ఫూర్తిని, మనోధైర్యాన్ని నింపుతోందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ యువతీ యువకులు విద్యలో ముందుండి, ఉద్యోగావకాశాలను సాధించడం ద్వారా ఉన్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం హైదరాబాదులో అసిస్టెంట్ ట్రెజరర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీవిధ్య, మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనికోరారు. కార్యక్రమంలో ఆదివాసీఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముమ్మర వాహన తనిఖీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని పందిరిమామిడి జంక్షన్ వద్ద రంపచోడవరం ఎస్ఐ ఎమ్ఆర్‌కె రాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన పత్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి నియంత్రించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ముఖ్యకూడళ్ల వద్ద వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహన పత్రాలు కలిగి ఉండాలని, వాహనాలకు బీమా చేయించాలన్నారు.బైకిస్టులు హెల్మెట్‌ను, ఇతర వాహనదారుల సీట్‌బెల్ట్ విధిగా ధరించాలని సూచించారు. సరైన వాహనపత్రాలు లేకున్నా, ట్రాఫిక్ నిబంధలను అతిక్రమించినా కేసు పెట్టడంతోపాటు జరిమానా విధించక తప్పదని హెచ్చరించారు.



ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

డెంగీ, మలేరియా నియంత్రణపై సమీక్ష

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఏజెన్సీలో డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బందితో ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి సమీక్షించారు. ఆదివారం ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో మలేరియా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదైన పిహెచ్‌సిల వైద్యాధికారులతో ప్రాంతాల వారీగా సమీక్షించి, మలేరియా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నరసాపురం పిహెచ్‌సిని సందర్శించి, వైద్యసేవలపై ఆరా తీశారు. తర్వాత ఈతలపాడు, ఐ.పోలవరం గ్రామాల్లోని మలేరియా పీడితులను పరామర్శించి, వారికి తగు జాగ్రత్తలు చెప్పారు. డ్రైడే ఫ్రైడే అమలుకు ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు గృహ సందర్శన చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, జనావాసాలతోపాటు ఇతర పబ్లిక్, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ లేకుండా సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిఎంఒ డాక్టర్.జి.వీర్రాజు, చింతూరు, రంపచోడవరం అడిషనల్ డిఎంహెచ్ఒ బిఎన్ఎస్.కుమార్, ఎంటోమాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ పిఎస్ఎస్ ప్రసాద్, డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి, జోనల్ మలేరియా అధికారి, డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ ప్రకాశం, ఎఎంఒ, అన్ని పిహెచ్‌సిల వైద్యాధికారులు, సూపర్‌వైజింగ్ సిబ్బంది, ఎంటిఎస్ పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న రామిరెడ్డి

గంజాయి అనర్థాలపై అవగాహన

▸▸ పోలీసుల ఆధ్వర్యాన వారపుసంతలో బుర్రకథ ప్రదర్శన

▸▸ ఆసక్తిగా తిలకించిన గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు: గంజాయి సాగు, రవాణాల వల్ల కలిగే అనర్థాలపై పోలీసుల ఆధ్వర్యంలో జీకే వీధి మండలం దారకొండ వారపు సంతలో గిరిజనులకు బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. గంజాయి సాగు, అక్రమ రవాణా వలన కలిగే నష్టాలు, ఇక్కట్లుపై మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించే విధంగా స్థానిక ఎస్ఐ రామకృష్ణ బుర్రకథను ఏర్పాటు చేశారు. ఈ కళాబృందం బుర్రకథ, గేయాలు, నృత్యాల రూపంలో గంజాయి అనర్థాలపై గిరిజనులకు వివరించారు. గంజాయిని విడనాడి, ప్రత్యామ్నాయ పంటలపై గిరిజనులు దృష్టిపెట్టాలని వివరిస్తూ,బుర్రకథను ప్రదర్శించగా, సంతకు వచ్చిన గిరిజనులు ఆసక్తిగా తిలకించారు. గంజాయి సాగు, అక్రమ రవాణా వల్ల కేసులు, అరెస్టులతో జైలు పాలై, వారితోపాటు వారి కుటుంబాలలో కలిగే విషాదంపై బుర్రకథ రూపంలో తెలియజేశారు. గిరిజన యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏ విధంగా పొందాలో కళాకారులు బుర్రకథ రూపంలో ప్రదర్శిస్తూ గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.



ఆసక్తిగా తిలకిస్తున్న గిరిజనులు



వారపుసంతలో బుర్రకథ ప్రదర్శన

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మండలంలోని దేవరపల్లి గ్రామంలో జనసేన నాయకులు కుర్ల రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఆదివారం స్వచ్ఛందంగా ఆ పార్టీలో చేరారు. పార్టీలో కొత్తగా చేసిన వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ, కుంటిసాకులు చూపి అర్హులైన ఎందరికో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో మన్యవాసులకు ఒరిగిందేమీ లేదని, గిరిజనులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఏజెన్సీ రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో ఆదివాసీలు ఉన్న హక్కులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ గ్రామస్వరాజ్యం నినాదంతో గిరిజన పల్లెల్లో అభివృద్ధి కాంతులు నింపుతామని, సమస్యలను పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ఎటువంటి సమస్య వచ్చినా, గిరిజనానికి జనసేన అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మారేడుమిల్లి మండల అధ్యక్షులు మల్ల దుర్గాప్రసాద్, గాదె ధర్మతేజ, కానెం శివకుమార్, నాగులపల్లి .శ్రీను, రాంబాబు, బట్ట శ్రీను, బట్ట మంగి రెడ్డి పాల్గొన్నారు.

పట్టపగలే బైక్ చోరీ

ప్రజాశక్తి - మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో పట్టపగలే దొంగలు హల్‌చల్ చేశారు. ఇంటి ముందు పెట్టిన పల్సర్ బైక్ చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కాళిదాస్ అనే ఇంటి యజమాని తన ఇంటిముందు బైకును పార్కింగ్ చేసి ఉంచగా, పట్టపగలే గుర్తుతెలియని దొంగ బైక్‌ను దొంగలించుకుపోయారు. అక్కడున్న సిసి టీవీ కెమెరాలో చోరీ దృశ్యాలు నమోదయ్యాయి. దీనిపై బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యుటిఎఫ్ తెలుగు రాష్ట్రాల ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - చింతూరు : చింతూరు యుటిఎఫ్ భవన్‌లో ఆదివారం జిల్లా కార్యదర్శి పండా కృష్ణయ్య అధ్యక్షతన యూనియన్ ఆంధ్రా, తెలంగాణ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. యుటిఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి.నాగమల్లేశ్వరరావు, ఖమ్మం జిల్లా పూర్వ అధ్యక్షులు బి.నరసింహారావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక పూర్వ సంపాదకులు జి.గోపాలకృష్ణ, యూనియన్ విలీన మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్రాల విభజన అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ విద్యావిధానంలో వచ్చిన మార్పులు, చేర్పులు, విద్యా విధానం అమలు జరుగుతున్న తీరు, ప్రపంచీకరణ విధానాల ప్రభావం తదితర అంశాలపై చర్చించారు. రెండు రాష్ట్రాల్లోనూ సిపిఎస్ అమలు, ఆంధ్రప్రదేశ్‌లో జిపిఎస్‌ను బలవంతంగా రుద్దేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలు, జరుగుతున్న పరిణామాలు గురించి చర్చించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ కూనవరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు, చింతూరు అధ్యక్షులు బి.ముత్తయ్య, సబ్ కమిటీ సభ్యులు యం.వెంకటనారాయణ, విఆర్.పురంమండల కార్యదర్శి యన్.జగదీష్, రామకృష్ణ, వాసు, యం.రాంబాబు, సీనియర్ ఉపాధ్యాయులు దూలయ్య పాల్గొన్నారు.

150 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రికి చెందిన రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించార రామకృష్ణ మఠం కార్యాలయ ఇన్‌ఛార్జి స్వామి వేద విద్యానందజీ మహారాజ్ పర్యవేక్షణలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ డాక్టర్ ఎస్. సంపత్ కుమార్ పాల్గొని 150 మందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 55 మందికి రక్తపరీక్షలు, 9.మందికి థైరాయిడ్ పరీక్షలు, ఆరుగురికి ఎక్స్‌రేలు, 14 మందికి ఫిజియథెరపీ సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. మిషన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ గాధిరాజు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. రోగులు, సహాయకులకు అన్నదానం సమకూర్చారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఒక పక్క ఛార్జీల మోత.. మరో పక్క విద్యుత్ కోత..

-చిన్న వ్యాపారులనూ వదల్లేదు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కరెంట్ షాక్ కొట్టిన కాకిలా అయిపోయాడు అనడం వినే ఉంటాం. కరెంట్ బిల్లుల్ని చూస్తుంటే రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులు పరిస్థితి అలాగే ఉంది. ట్రూ ఆఫ్, ఇంధన సర్దుబాటు, విద్యుత్ సుంకం, కస్టమర్ చార్జీల పేరుతో ప్రభుత్వం వినియోగదారుల నుంచి వసూలు చేస్తోంది. దీంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది చిరు వ్యాపారుల పరిస్థితి.ఉపాధి కోసం చిన్న దుకాణాలు నడిపే వ్యాపారులనూ ప్రభుత్వం వదల్లేదు.

కోవిడ్ సమయం నుంచి ఇప్పటికీ వ్యాపారాలు ముందున్న స్థాయికి చేరుకోలేదు. అసలే వ్యాపారాలు తగ్గి ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇప్పుడు ప్రభుత్వం వేస్తున్న విద్యుత్ చార్జీల భారం మరింత కుంగదీసేలా మారింది. వివిధ రకాల చార్జీల పేరుతో గతంలో వచ్చే దానికంటే అధికంగా బిల్లులు వస్తుండటంతో ఏమి చేయాలో పాలు పోనీ ఆందోళన స్థితిలో చిరు వ్యాపారులు, వినియోగదారులు పడ్డారు. అన్ని కేటగిరీలపైన ఈ అదనపు భారాలు పడ్డాయి. గృహాలు, వ్యాపార సముదాయాలు అన్నింటికీ చార్జీల భారం పడుతోంది. కరెంటు సక్రమంగా ఇవ్వలేకున్నా, చార్జీలు మాత్రం విపరీతంగా పెంచుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. కొన్నేళ్ల క్రితం వాడిన కరెంటుపై రకరకాల పేర్లతో వస్తున్న భారీ బిల్లులు నేడు కట్టాల్సి రావడమే మింగుడుపడడం లేదు. అద్దె ఇళ్లల్లో అంతకు ముందున్న వారు వాడిన విద్యుత్ కు ఇప్పుడు ఉంటున్న వారు బిల్లు చెల్లించాల్సి రావడం గమనార్హం.

వైసిపి అధికారంలోకి వచ్చాక స్లాబులు మార్చేయడం, చార్జీలు పెంచడంతోపాటు ట్రూఆఫ్, సర్దుబాటు పేరుతో ఎడాపెడా బాధిస్తోంది.. 2021-22 టారిఫ్ ఆర్డర్‌లో నెలకు 500 యూనిట్ల వినియోగం దాటిన కనెక్షన్లపై యూనిట్ కు అదనంగా 90 పైసలు వేసింది. 2021 ఏప్రిల్ నుంచి గృహ విద్యుత్ కనెక్షన్లపై కిలో వాట్ కు రూ.10 వంతున స్థిర చార్జీలు వసూలు చేస్తోంది. శ్లాబుల మార్పు టారిఫ్‌ల సవరణ వల్ల అదనపు భారం పడుతోంది. 2021-22 వరకు అమలైన టారిఫ్ ప్రకారం ఎ, బి, సి కేటగిరీలు ఉండేవి. 0-5 యూనిట్లు, 50-75 యూనిట్ల శ్లాబులను ఏ కేటగిరీగా పరిగణించేది. 0-75 యూనిట్లు వాడిన వారికి తక్కువ ఛార్జీలు పడేవి. ఈ ప్రభుత్వం 2022-23 నుంచి స్లాబులను సవరించి 0-30 యూనిట్ల వరకు ఒక శ్లాబ్ గా, 31-75 యూనిట్ల వరకు మరో శ్లాబ్ గా విభజించింది. యూనిట్ పై రేటూ పెంచింది. దీంతో 0.75 యూనిట్లు వాడే పేదలపై సగటు యూనిట్ ద్వారా పెరిగింది. 2022 మే నుంచి వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లకు సుంకం కింద వసూలు చేసే 6 పైసలను ఒకేసారి రూపాయికి పెంచారు. యూనిట్కు 94 పైసలు పెంచడంతో అదనపు భారం పడుతోంది. 2014-19 మధ్యకాలంలో విద్యుత్ కొనుగోలు వ్యయానికి, వినియోగదారుల నుంచి వసూలు చేసిన చార్జీలకు మధ్య వ్యత్యాసాన్ని పూడ్చేందుకు ప్రజలపైనే భారం మోపారు. 2022 జూలై నుంచి 25 నెలల వ్యవధిలో వినియోగదారుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసేందుకు ఎపిఇఆర్ సి అనుమతి ఇవ్వడంతో అదనపు భారం పడుతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి ఇంధన సర్దుబాటు చార్జీల వసూళ్లను గత ఏప్రిల్ నుంచి డిస్కంలు ప్రారంభించాయి. ఈ ఏడాది 12 నెలలూ వసూలు చేయనున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి ఇంధన సర్దుబాటుకు కొత్త విధానం అమల్లోకి తెచ్చింది. ఒక నెలలో సర్దుబాటు చార్జీలను తర్వాతి నెల బిల్లులోనే వసూలు చేస్తారు. ఆ కారణంగానే బిల్లులో వినియోగదారులపై కోట్లలో అదనపు భారం పడుతోంది.

అప్రకటిత కోతలు..

విద్యుత్ సరఫరా లోటు పూడ్చడానికి విధిస్తున్న అత్యవసర లోడ్ రిలీఫ్ (ఇఎల్ఆర్)తో వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అప్రకటిత విద్యుత్తు కోతలతో ఉక్క పోత దోమల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాత్రిపూట దోమతో యుద్ధం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. సరఫరా నిలిచిపోతే మళ్ళీ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. విద్యుత్తు ఉప కేంద్రానికి ఫోన్ చేస్తే బిజీ వస్తుందని ప్రజలు చెబుతున్నారు. బిల్లులు చెల్లింపు ఒక రోజు ఆలస్యమైతే అపరాధ రుసుం వసూలు చేస్తున్న సిబ్బంది జనం పడుతున్న అవస్థలను పట్టించుకోవాలని కోరుతున్నారు. పగటి వేళల్లోనూ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. విద్యుత్తు ఆధారిత వ్యాపారాలు జరగక వ్యాపారులు నష్టపోతున్నారు. తాగునీటి ఇబ్బందులు సైతం ఎదురవుతున్నాయి. కోతలతో తమ వ్యాపారాలు సాగడం లేదని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి

ఒక ప్రక్క చార్జీల మోత, మరో పక్క విద్యుత్ కోతలను ప్రజలు భరించలేకపోతున్నారు. ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని రద్దు చేయాలి. సామాన్య ప్రజానీకం విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని భరించలేక అష్ట కష్టాలు పడుతున్నారు. విద్యుత్ కోతలను అరికట్టి సక్రమంగా విద్యుత్ పంపిణీ జరిగేలా చూడాలి. ఇప్పటికే ప్రజలు పెరుగుతున్న ధరల భారాలకు తోడు బిల్లులు వస్తున్న తీరు మరింత భారంగా ఉంది. పెంచిన

రాజు
టిఫిన్ షాపు నిర్వాహకుడు, పాడేరు

అధికంగా విద్యుత్ బిల్లులు

కరెంట్ బిల్లులు క్రమక్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. పెరుగుతున్న ధరలకు తగ్గట్టు వ్యాపారాలు పెరగడం లేదు. గతంలో కరెంట్ బిల్లు ఇంటికి రూ.400 నుంచి రూ.500 వచ్చేది. ఇప్పుడు రూ.900 వస్తోంది. జిరాక్స్ షాప్ లో నెలకు రూ.1000 వరకు వచ్చేది ఇప్పుడేమో రూ.2000 వరకు పెరిగింది. మరోవైపు కోవిడ్ నుంచి వ్యాపారాలు మందులాగా జరగడం లేదు. ఆదాయం బాగా తగ్గిపోతున్న సమయంలో ఎప్పుడు ప్రభుత్వం ఇటువంటి భారాలు మోపడం మరింత ఇబ్బందికరంగా ఉంది. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి చిరు వ్యాపారులను ఆదుకోవాలి.

రవి
జిరాక్స్ షాపు నిర్వాహకుడు, పాడేరు

పేదలపై భారం..

బిల్లులో రకరకాల చార్జీల పేరుతో అదనపు భారం మోపుతోంది. విద్యుత్ చార్జీలు పెంచబోమని.. పైగా తగ్గిస్తామని ప్రతిపక్ష నేతగా ఊరు వాడ దండోరా వేసిన జగన్.. సీఎం అయ్యాక ఏకంగా ఎనిమిది సార్లు పెంచి సామాన్యులపై భారం మోపారు. గత ప్రభుత్వాల్లో ఎవరూ వేయని భారాన్ని ఇప్పుడు పేదలపై మోపారు. ప్రజల కళ్ళుగప్పి దొడ్డిదారిన సర్దుబాటు పేర్లతో భారం మోపుతూ ఇది చాలదన్నట్లు స్మార్ట్ మీటర్ల పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తూ కార్పొరేట్ల జేబులో నింపాలని చూస్తోంది. పేదలకు ఉచిత పథకాలతో రూ.10 ఇచ్చి ధరలు, పన్నుల రూపంలో రూ.100 లాక్కోవడం దారుణం.

ఎల్.సుందరరావు
సిపిఎం మండల కార్యదర్శి, పాడేరు


వంతెన పనులు వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: రెండు జిల్లాల సరిహద్దు జిలుగులపాడు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు తక్షణమే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. జరుగుతున్న వంతెన పనులను కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి పాసిపెట శాంతకుమారి కార్యకర్తలతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా చిలకగెడ్డ పంచాయతీ పరిది జీలుగులపాడు గ్రామ సమీపంలో వంతెన నిర్మించడంతో ఎన్ ఆర్. పురం, రొంపల్లి పంచాయతీ గ్రామాల తో పాటు విజయనగరం జిల్లా మెంటాడ మండలం అడ్డతీగల పంచాయతీ పరిధి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కలుగుతుందని తెలిపారు.అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై నాసిరకమైన పనులు చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పనులు ప్రారంభించి ఏడది కావస్తున్నా పూర్తి కాలేదన్నారు. ఆ పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల ప్రజలు వర్షాల కారణంగా గెడ్డం ఉధృతి కారణంగా దాటలేని పరిస్థితితో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దాటవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు కె.పోతురాజు, టి.సోమేశ్వరరావు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

అనారోగ్యంతో శిశువు మృతి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని మొట్టు జోరు పంచాయతీ పెట్టుగోడలు గ్రామంలో శనివారం మూడు నెలల పాప మరణించింది. వంతల మోహన్‌రావు, రాములమ్మ దంపతుల మొదటి సంతానం ఈ పాప. ఒక్కరోజులోనే అనారోగ్యంతో చనిపోవడంతో జీర్ణించుకోలేక పోతున్నామని తల్లిదండ్రులు అన్నారు. చిన్నారి మృతి అందరిని కలిసి వేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిశు మరణాలపై ప్రత్యేక దృష్టి సాధించి తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తమ ఆచార్యులుగా ఎయు నుంచి ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ ఆచార్యుల పురస్కారానికి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఆరుగురు ఆచార్యులు ఎంపికయ్యారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల నుంచి ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల నుంచి ఆచార్య పి.శ్యామల, ఆచార్య సివి.నాయుడు, న్యాయ కళాశాల నుంచి ఆచార్య కె.సీతామాణిక్యం, ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలితభాస్కరి ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన ఏయూ స్నాతకోత్సవ మందిరం వేదికగా జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరు పురస్కారాలను అందుకోనున్నారు. ఈ సంవత్సరం పురస్కారాలు స్వీకరిస్తున్న వారిలో నలుగురు మహిళలు ఉండటం విశేషం. ఈ సందర్భంగా అవార్డుకు ఎంపికైన ఆచార్యులను వర్సిటీ అధికారులు, ఆచార్యులు అభినందించారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే వైరస్‌ల వ్యాప్తి నియంత్రణ

ప్రజాశక్తి-విశాఖపట్నం: కరోనా వైరస్‌ల వ్యాప్తి ఒక దేశం నుంచి మరో దేశానికి విస్తరించకుండా ఉండాలంటే ప్రాథమిక దశలోనే గుర్తించి అంతర్జాతీయ ఆరోగ్య నియంత్రణ సూత్రాలను విధిగా అమలు చేయాలని భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగం ఎర్ పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్ అధిపతి డాక్టర్. ఎమ్.అనురాధ పేర్కొన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) సామాజిక వైద్యవిభాగం ఆధ్వర్యాన ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ 28వ వార్షిక సమావేశాలలో ఆదివారం ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ రూపొందించిన అంతర్జాతీయ ఆరోగ్య నియంత్రణలను పూర్తి స్థాయిలో కేవలం 64 దేశాలు మాత్రమే అమలు చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో వైరస్‌ల వల్ల ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం జరగకుండా ఉండాలంటే వైద్య ఆరోగ్య రంగంలో ప్రపంచ దేశాల మధ్య సహకారం, సామాజిక వైద్య నిపుణుల అప్రమత్తత అవసరమని చెప్పారు.

ఏజెన్సీలో చురుగ్గా రోడ్లు, వంతెనల నిర్మాణాలు

- రూ,38 వేలా191 లక్షలు నిర్మాణ వ్యయం
- పిఎంజిఎస్‌వై కింద 82 పనులు మంజూరు
- ప్రజాశక్తితో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ (పిఐయు) పాడేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లావణ్య కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో పీఎంజిఎస్ వై పథకం కింద 38వేల 191 లక్షల నిర్మాణ వ్యయంతో రోడ్లు, వంతెనలు మొత్తం 82 పనులు చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ (పిఐయు) పాడేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లావణ్య కుమార్ వెల్లడించారు. పిఎంజీఎస్ వై పథకం కింద చేపట్టిన ఈ రోడ్లు వంతెనల నిర్మాణంతో పాలు మారుమూల ప్రాంతాలకు రవాణా సౌలభ్యం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ రోడ్లు వంతెనల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే....

మండలాల్లో చేపట్టిన పనులు

అనంతగిరి మండలంలో 6పనులు, అరకు మండలంలో ఒక రోడ్డు, చింతపల్లి మండలంలో 9, డుంబ్రీగూడలో 3, జి.మాడుగుల 10, జీకే వీధి మండలంలో అత్యధికంగా 29 పనులు హుకుంపేట మండలంలో 2, కొయ్యూరు 1, ముంచంగిపుట్ 5, పాడేరు మండలంలో3, పెదబయలు 7 పనులు చొప్పున మారుమూల ప్రాంతాల్లో ఈ రోడ్లు వంతెన పనులు నిర్వహిస్తున్నాం.

రోడ్డు పనుల ప్రగతి ఏమిటి?


పీఎంజిఎస్‌వై పథకం కింద 2017-18 నుంచి పాడేరు ఏజెన్సీకి మంజూరైన ఈ నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయి. ఇప్పటి వరకు 10 వేల 923 లక్షల వ్యయంతో 42 రోడ్లు వంతెన నిర్మాణపు పనులు పూర్తి చేసాం.

వివిధ దశలలో ఉన్న పనులు

15 వేల 261 లక్షల వ్యయంతో 30 పనులు ప్రస్తుతం వివిధ నిర్మాణ దశలలో ఉన్నాయి. మిగిలిన రోడ్డు పనులు కొన్ని ప్రారంభ దశలో ఉండగా మరికొన్ని పనులు సాంకేతిక కారణాలు, అటవీ చట్టపరమైన అభ్యంతరాలతో నిర్మాణం చేపట్టవలసి ఉంది.

పనులు పూర్తి వివరాలు

పీఎంజీఎస్వై కింద చేపట్టిన ఈ పనులన్నీ 2024 మార్చి నాటికి పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఈ పనులన్నీ పూర్తయితే ఏజెన్సీలోని చాలా మారుమూల ప్రాంతాలకు రవాణా సమస్య పరిష్కారం అవుతుంది.





విజేతలతో అతిథులు, నిర్వాహకులు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవిపి.కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాలో మూడు రోజులపాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండర్-15 బాల బాలికల బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ - 2023 పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ డిఐజి రాజీవ్ కుమార్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను విశాఖలో పనిచేసిన సమయంతో పోల్చుకుంటే నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందని, క్రీడలకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రాంగణాలు రూపొందిస్తున్నారని తెలిపారు. ప్రతి ఏడాదీ రాష్ట్రం నుంచి ఇద్దరు ముగ్గురు క్రీడాకారులు అంతర్జాతీయంగా వెలుగులోకి వస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీ అంతర్జాతీయ గుర్తింపు పొందిందని, అలాగే విశాఖలోనూ అంతర్జాతీయ స్థాయి అకాడమీలు స్థాపించాలని ఆయన నిర్వాహకులను కోరారు. గౌరవ అతిథిగా ఎపిఇపిడిసిఎల్ డైరెక్టర్ డి.చంద్రం, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ పి.అంకం చౌదరి, డిఎస్‌పి అండ్ సిఇఒ ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సిహెచ్.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.ఉషశ్రీ పాల్గొన్నారు.

విజేతలు వీరే

మిక్సిడ్ డబుల్స్‌లో టి.చరణ్ రామ్, కె.గగనశ్రీ చౌదరి. బాలికల డబుల్స్‌లో బి.విజయలక్ష్మి, కె.గగనశ్రీ చౌదరి విజేతలుగా నిలవగా, బాలుర డబుల్స్‌లో టి.చరణ్‌రామ్, వి.హరికృష్ణ విజేతలుగా నిలిచారు. అదే విధంగా బాలికల సింగిల్స్ విభాగంలో విశాఖ నగరానికి చెందిన దంగటి జశ్విత విజేతగా నిలవగా బాలుర సింగిల్స్‌లో చిత్తూరుకు చెందిన టి.చరణ్ రామ్ విజేతగా నిలిచారు.

కలుషిత నీటి సమస్యపై విచారణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కుళాయిల ద్వారా వస్తున్న తాగునీటిలో డ్రైనేజీ కలుషిత జలాలు కలుస్తున్నాయని, అందువల్ల రోగాల బారిన పడుతున్నామని 38వ వార్డు సోల్జర్ పేటకు చెందిన అంజు అనే మహిళ సౌత్ కంప్లైంట్ గ్రూపులో ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి వార్డులో పర్యటించారు. కలుషిత నీరు వస్తుందని ఫిర్యాదు చేసిన ప్రాంతాలకు వెళ్లి కుళాయిల్లో వస్తున్న నీటిని పరిశీలించారు. స్వచ్ఛమైన జలాలు వస్తున్నాయని, డ్రైనేజీ నీరు కలవడం లేదని అధికారులు గుర్తించి, ఆ ప్రాంత ప్రజల సమక్షంలో కుళాయి ద్వారా వచ్చిన నీటిని తాగి చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటితోపాటు ఏవైనా సమస్యలుంటే స్థానికులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జివిఎంసి వాటర్ వర్క్స్ విభాగం ఎఇ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణ, స్థానిక వైసిపి నాయకులు ఆదిల్, టేకి ప్రసాద్, చిన్ని కృష్ణ, రాజారెడ్డి, జివిఎంసి వాటర్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆర్కే బీచ్‌లో కాళీ మాత ఆలయం నుంచి వైఎంసిఎ వరకూ నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎపి నెడ్‌క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బుచ్చిరాజు, వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, విశాఖ ఐ హాస్పిటల్ డాక్టర్ గోపాలరాజు పాల్గొన్నారు.

ఉసూరుమంటున్న రైతు

- వర్షాభావంతో ఎండిపోతున్న వరి పొలాలు
- జలాశయాల కింద తడుపుకొని దమ్ములు
- నిర్వహణలేక కాలువలు అస్తవ్యస్తం
- తాండవ మెయిన్‌గేట్‌కు లీకేజీలు
- వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్‌లో నెలకొన్న వర్షాభావంతో ఉడుపులకు అదును పోయింది. ఆకులు ముదిరిపోయాయి. ఉడిసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న వరి పంటను చూసి రైతు ఉసూరుమంటున్నాడు. పంటలతో పచ్చగా కనిపించాల్సిన పల్లెలు పగుళ్ల భూములతో దర్శనమిస్తున్నాయి. వరి పొలాల్లో గాబులు తీయాల్సిన రోజుల్లో గేదెలు మేపుకుంటున్న దుస్థితి ఏర్పడింది. నిధుల్లేక ఖరీఫ్‌కు ముందు జలాశయాలు, కాలువలు నిర్వహణ చేపట్టలేదు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందక కాలువలకు ఆనుకొనివున్న భూముల్లో దమ్ముకాలేదు. ఆకులు తడుపుకొని, పొలాలకు మోటార్లు పెట్టుకొని, నీళ్లు మోసుకొని ఉడుపులు చేస్తున్న పరిస్థితి వుంది.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాధారణ సాగు విస్తీర్ణం 2,04,980 ఎకరాలకు సెప్టెంబరు 2 నాటికి 84,847 ఎకరాల్లో సాగైంది. గతేడాది ఇదే కాలానికి 1,38,140 ఎకరాల్లో పంటలు నమోదయ్యాయి. 2,04,980 సాధారణ సాగు విస్తీర్ణంలో వరిపంట భాగం అత్యధికం. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు సెప్టెంబరు 2 నాటికి 62,775 ఎకరాల్లో (46 శాతం) సాగైంది. ఉడుపుల గడువు ముగిసే నాటికి సగం కూడా సాగుకాని పరిస్థితి వుంది. జిల్లాలో జూన్ ఒకటి నుంచి సెప్టెంబరు 2 వరకు 488.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా 397.3 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటు వర్షపాతంలో - 19 శాతం లోటువుంది. 24 మండలాలకు 11 మండలాల్లో వర్షపాతం లోటువుంది. ఈ లోటు ఖరీఫ్ ఆరంభం నుంచి కొనసాగుతూనేవుంది. ఏటా ఖరీఫ్‌కు ముందు జలాశయాల మరమ్మతులు, కాలువల నిర్వహణ పనులు పూర్తిచేసి సాగునీరు విడిచిపెట్టే సాంప్రదాయం వుండేది. నిధుల్లేక నీటిపారుదల శాఖాధికారులు జలాశయాల మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో వీటి పరిధిలోని ఆయకట్టుకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో జలాశయాల కిందవున్న ఆయకట్టులో ఉడుపులు కాలేదు. గతేడాది వలె జలాశయాల్లో నీటి నిల్వలు లేనప్పటికీ, ఉన్న నీటిని సరఫరా చేయగలిగిన పరిస్థితిలో నీటిపారుదలశాఖ లేదు.

ఆగస్టు 2న పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాలు, 10న తాండవ జలాశయ నీటిని వదిలినప్పటికీ వీటి కింద సగం విస్తీర్ణంలో కూడా వరి పంట సాగుకాలేదు. పెద్దేరు కుడికాలువ తుప్పలు, డొంకలు పట్టివుంది. విడిచి పెట్టిన నీరు కిందికి వెళ్లక కాలువకు ఆనుకొని వున్న భూముల్లో దమ్ముకాలేదు. దమ్ము చేసిన పొలాలకు నీరులేక పగుళ్లదేరి కనిపిస్తున్నాయి. జిల్లాలోని తాండవ, పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాల కింద 75,414 ఎకరాల ఆయకట్టు వుంది. దీంట్లో ఆగస్టు 31 నాటికి 19,341 (26 శాతం) ఎకరాల్లో వరి సాగైంది. సెప్టెంబరు 2 నాటికి 30,171 ఎకరాల్లో (40 శాతం) వరి పంట వేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. పెద్దేరు కుడికాలువ నీరు రాకపోవడంతో రావికమతం మండలం కవ్వగుంటకు సమీపంలోని చింతమానుపొలం ఎండిపోయింది. దమ్ము పట్టేందుకు నీరులేకపోవడంతో రైతులు పశువులు మేపుకుంటున్నారు. కవ్వగుంటకు ఆనుకొని కుడికాలువ కిందవున్న భూమికి నీరురాక మహిళలు బకెట్లతో పొలం తడుపుతుంటే, సీముసిరి రాము అనే రైతు ఉడిసేందుకు 36 సెంట్లు మడి సిద్ధం చేయడం కనిపించింది. రాము మడికి ఎగువన వున్న ఆకు మడి ఎండిపోయింది. మరికొంత మంది రైతులు మోటార్లు పెట్టుకొని దమ్ములు చేస్తున్నారు. మోటార్ నీటితో దమ్ముచేసిన ఉరికిడి తాతబాబుకు చెందిన రెండెకరాల వరి పొలం పగుళ్లదేరుతోంది.


చింతమాను పొలంలో ఎండిపోతున్న వరి

తాండవ మెయిన్‌గేట్ లీకేజీలను శాశ్వతంగా అరికట్టేందుకు రూ.7.50 లక్షల విలువైన పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. నీరు వృథాగా పోతోంది. ఆయకట్టుకు నీటి సమస్య ఏర్పడుతోంది.

జిల్లాలో సెప్టెంబరు 2 నాటికి జలాశయాల వారీగా ఆయకట్టు, సాగైన వరి పంట వివరాలు (ఎకరాల్లో)

జలాశయం	ఆయకట్టు	వరిసాగు	శాతం
తాండవ	32,689	11,250	34.12
పెద్దేరు	15,105	6,207	41.09
రైవాడ	15,344	6,464	42.13
కోనాం	12,276	6,250	50.91

వైసిపి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పిలుపునిచ్చారు. దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ ఉరికిటి నారాయణరావు ఆధ్వర్యంలో వార్డు నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం జిల్లా పరిషత్ వద్దగల స్టే ఇన్ కల్యాణ మండపంలో జరిగింది. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్ఎ.రెహమాన్, తైనాల విజయ్ కుమార్, దక్షిణ నియోజకవర్గ సీనియర్ నాయకులు సీతంరాజు సుధాకర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఛైర్మన్ జాన్ వెస్లీ, ద్రోణంరాజు శ్రీవాత్సవ, నియోజకవర్గం కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యుత్ అవాంతరాల నివారణకు చర్యలు

- ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యుత్ అవాంతరాలను నివారించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎపిఇఆర్‌సి ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా ఉంటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్తు సరఫరా అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వుండగా థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతోందన్నారు. దీంతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం, వాటి ప్రస్తుత ధరలను పరిశీలించిన కమిషన్ రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అనుమతించిందని పేర్కొన్నారు. అందులో భాగంగా సంస్థ పరిధిలోని నిరంతర ప్రాసెసింగ్ పరిశ్రమలు తమ రోజువారీ విద్యుత్ వినియోగంలో 30 శాతం కాంట్రాక్టు లోడులో తగ్గించుకొనే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇతర పరిశ్రమలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిఫ్ట్ మాత్రమే పని చేయాలని, సాయంత్రం 6 గంటల తరువాత విద్యుత్ వినియోగానికి అనుమతించేది లేదని తెలిపారు. వారానికి ఒకరోజు పవర్ హాలీడేను కూడా అమలు చేయాలని సూచించారు. పవర్ హాలీడేను జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తామని, ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండు వారాలపాటు పవర్ హాలీడే అమలులో ఉంటుందని తెలిపారు. ఈ నియంత్రణ చర్యల నుంచి బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆక్సిజన్ ప్లాంట్లకు, రైస్ మిల్లింగ్ యూనిట్లకు సంబంధించిన పరిశ్రమలు మినహాయించబడ్డాయని పేర్కొన్నారు. నియంత్రణ చర్యలను పాటించని పరిశ్రమలకు కమిషన్ నిర్దేశించిన జరిమానా ఛార్జీలు విధించబడతాయన్నారు. ప్రతిరోజూ విద్యుత్ సరఫరా తీరును సమీక్షించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా కోసం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని శ్రీ స్వామి వివేకానంద సంస్థలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ ముస్తాఫ్ అహ్మద్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి జెసిఐ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు అందజేశారు. జెసిఐ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, జోన్ వైస్ ప్రెసిడెంట్ వి.రాజేష్ కుమార్, ప్రాజెక్ట్ కో - ఆర్డినేటర్ కెపి.కళ్యాణ్, డే కో - ఆర్డినేటర్ మోహిని, నానాజీ, రమ్య పాల్గొన్నారు. ఈ శిబిరంలో 200 మంది వైద్య సేవలు పొందారు. పోషకాహారలోపంగల పిల్లలకు స్వచ్ఛంద సంస్థ వారు పోషకాహారం అందజేశారు.


ప్రచార కార్యక్రమంలో టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ తదితరులు

42వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి 42వ వార్డు శ్రీకన్య థియేటర్ వెనుక చాకలి వీధిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్ర ప్రజలను నయవంచనకు గురిచేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.